క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



గౌరీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: గౌరీపరమేశ్వరుల ఆలయ 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం కె.కోటపాడులో ఘనంగా నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై గౌరీపరమేశ్వరులకు పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలమాలలతో అందంగా ముస్తాబు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామాంజనేయ తీర్థం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు: శృంగవరంలోని సీతారామాంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఆలయంలో ఉదయం నుంచే గ్రామస్తులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా మహిళా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రొంగలి మహేష్, పూడి నారాయణమూర్తి, కోటాన ఈశ్వరరావు, కొట్యాడ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముకుందపురంలో సీతారాములవారి తీర్థం

మాడుగుల రూరల్: ముకుందపురంలో సీతారాముల వారి తీర్థం శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పెమ్మే ప్రసాదరావు, సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం నుంచి తప్పెటగుళ్ల, తోడపెద్దు సేవ, ముగ్గులు, బైక్ స్లో, పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు కె.జె.పురం విద్యార్థుల ఎంపిక



గ్రీష్మ



శ్రావణ్ కుమార్

మాడుగుల రూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు కె.జె.పురం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన పరీక్షల్లో పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆళ్ల గ్రీష్మ, భీశెట్టి శ్రావణ్‌కుమార్ ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం వి. దాసు శుక్రవారం తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన యూటీఎఫ్ కార్యదర్శి పోలిమేర చంద్రరావుతోపాటు విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ వారు అభినందించారు.

సబ్ జైల్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: స్థానిక సబ్ జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ శుక్రవారం సందర్శించారు. ఖైదీలకు తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలపైనా ఆరా తీశారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థిక స్థోమత లేని వారికి మండల లీగల్ సర్వీస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అటువంటి వారు ఎవరైనా ఉంటే జైల్ అధికారికి వివరాలు అందజేయాలని సూచించారు. ఖైదీల వివరాలను జైల్ సూపరింటెంటెంట్ సన్యాసిరావును అడిగి తెలుసుకున్నారు.

రంగురాళ్ల క్వారీ పరిశీలన

గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం పరిధిలో రంగురాళ్ల క్వారీని నర్సీపట్నం డీఎస్పీ పోతుల శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. క్వారీ ప్రాంతాల్లో అక్రమార్కులు రంగురాళ్లు తవ్వకుండా నాలుగు సంవత్సరాల నుంచి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎటువంటి తవ్వకాలు జరగకుండా నిత్యం గస్తీ నిర్వహించాలని గొలుగొండ ఎస్ఐ రామారావుకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ఘనంగా సైన్స్ డే



నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి పాఠశాలలో నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



నర్సీపట్నం: నమూనాలను పరిశీలిస్తున్న ఫిజిక్స్ డిపార్టుమెంట్ అధ్యాపకుడు శ్రీనివాస్



మాడుగుల డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ కృష్ణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



దేవరాపల్లి హైస్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో పడాల్‌దాస్



కె.కోటపాడులో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శన



మాకవరపాలెం: సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో, తదితరులు

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. విజ్ఞాన శాస్త్రంలో వివిధ అంశాలతో కూడిన నమూనాలను ప్రదర్శించేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. విజ్ఞాన శాస్త్రాన్ని సమాజంలో మరింత దగ్గరగా అనుసంధానించడం, వీటి పరిణామాల గురించి హెచ్ఎం సిహెచ్.ఫ్రాన్సిస్ వివరించారు. సైన్స్ ఉపాధ్యాయులు అల్లు అప్పారావు, అరుణ, విజయ రాణి, బాబి సహకారంతో విద్యార్థులు రూపొందించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రవీంద్ర భారతి...

రవీంద్ర భారతి పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కృష్ణా డిగ్రీ కాలేజీ ఎంఎస్సీ ఫిజిక్స్ డిపార్టుమెంట్ అధ్యాపకుడు డాక్టర్ ఎం.శ్రీనివాస్ విచ్చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించేందకు సైన్స్ సంబరాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు రూపొందించిన నమూనాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సి.వి.రామన్ సేవలు ప్రశంసనీయం

మాడుగుల: ప్రపంచం పొందుతున్న సౌకర్యాలు కల్పనలో సైన్సు ముఖ్య భూమిక పోషిస్తుందని ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్. శాస్త్రి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి ఎస్.ఎస్ కృష్ణ, సీవీ రామన్ జీవిత విశేషాలు అతను చేసిన పరిశోధన, సైన్సు రంగానికి చేసిన కృషిని విశదీకరించారు. ఫిజిక్స్ ఉపన్యాసకులు ఎ.వి.ఆర్. ప్రసాదరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఉపన్యాసకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఫిజిక్స్ విభాగాధిపతి కృష్ణను ఘనంగా సన్మానించారు.

సి.వి.రామన్ స్ఫూర్తితో యువత శాస్త్రవేత్తలుగా ఎదగాలి

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సి.వి. రామన్ చిత్రపటానికి ఎంఈవో బి. పడాల్‌దాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు తయారీ చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. సీవీ రామన్ జీవితాన్ని విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకుని శాస్త్రీయ స్ఫూర్తితో సర్వోత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



గవరవరంలో విద్యార్థుల ప్రాజెక్టులు పరిశీలిస్తున్న హెచ్ఎం

వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం పెంపు

కె.కోటపాడు: విద్యార్థులలో దాగిఉన్న ఆలోచనలకు సైన్స్ జోడించి తయారు చేసే ప్రాజెక్టులతో విజ్ఞానం వికసిస్తుందని ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, కె.సత్యనారాయణ తెలిపారు. మేడిచర్ల, కె.కోటపాడు హైస్కూళ్లతోపాటు అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. ఆయా స్కూళ్ల విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. సైన్స్ పాఠ్యాంశాలపై అయ్యన్న పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నమూనాలు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్సు టీచర్ ఎం.నానీ పర్యవేక్షణలో విద్యార్థులు లోకాస్ట్, నోకాస్ట్‌తో తుపాను హెచ్చరికలు, కొండల ప్రాంతంలో ప్రమాదాలను ముందస్తుగా గుర్తించడం, తదితర సైన్స్‌పరమైన నమూనాలను ప్రదర్శించారు. వీటిని హెచ్ఎం ప్రసాద్‌రావు, సీనియర్ సోషల్ టీచర్ ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, కిరణ్ పరిశీలించారు. వాటిని ఎలా వినియోగిస్తారో చెప్పిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నమూనాల ప్రదర్శన

చోడవరం రూరల్: సైన్సు డే సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సి.వి. రామన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ నేతృత్వంలో విద్యార్థులు తయారు చేసిన పలు సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.సుహాసినీ కృప, వి.రమణారావు, ఎ.శంకర్, డి.వి.వి.రమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

మాకవరపాలెం: ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎంపీపీ రుత్తల లక్ష్మి సూచించారు. తామరం ఇమ్మానుయేలు ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా సైన్స్ దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను సంస్థ డైరెక్టర్ బిషప్ జీవన్‌రాయ్‌తో కలసి తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సేవా భావం అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఎంఈవో పి.ఎస్.ఎన్. మూర్తి, జీవన్‌రాయ్ ప్రసంగించారు. సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం మండలం తూటిపాల యూపీ స్కూల్, జి.కోడూరు, గిడుతూరు ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన వివిధ నమూనాలు, చార్టులు, మోడల్స్ ప్రదర్శించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో మూర్తి సైన్స్ క్విజ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నారాయణరావు, బాబ్జీరావు, రాము, లోవరాజు పాల్గొన్నారు.



మాకవరపాలెం: చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా



దేవరాపల్లి పరీక్ష కేంద్రం గదిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



దేవరాపల్లి జూనియర్ కళాశాల కేంద్రం

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్. నిర్మల, డీవో ఎస్.ఎస్.వి కేశవరావు తెలిపారు. స్థానిక పరీక్ష కేంద్రంలో శనివారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఈ నెల 18 వరకు జరుగుతాయన్నారు. ఇక్కడ స్థానిక జూనియర్ కళాశాలతోపాటు బేతపూడి కేజీబీవీ, తెనుగుపూడి గురుకుల విద్యాలయం, శారదా జూనియర్ కళాశాలల నుంచి 257 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. తొలి రోజు శనివారం తెలుగు-1, హిందీ-1, సంస్కృతం-1, జీఎఫ్‌సీ-1 పరీక్షలు జరుగుతాయన్నారు.

• మాడుగుల జూనియర్ కళాశాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మాడుగుల రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్. నీలిమ శుక్రవారం తెలిపారు. శనివారం ప్రథమ సంవత్సరం పరీక్షలకు 500 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఇక్కడ మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల, సురవరం కేజీబీవీ, వద్దాది జూనియర్ కళాశాల, గాయిత్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. 14 గదుల్లోనూ సీసీ కెమెరాలతో ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు పరీక్షలు జరుగుతాయని, 8 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 17 మంది ఇన్విజిలేటర్లుతోపాటు ఇద్దరు డిపార్టుమెంట్ అధికారులు, చీఫ్ సూపరిండెంటెంట్లను నియమించామన్నారు.

పరీక్షలకు ప్రైవేటు వాహనాలే గతి

చీడికాడ: ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని కోనాంలో డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో మొదటి సంవత్సరం 46 మంది, ద్వితీయ సంవత్సరం 36 మంది విద్యార్థినులు ఈ పరీక్షలు రాయనున్నారు. వీరికి ప్రత్యేకించి సొసైటీ నుంచి బస్సు సౌకర్యం కలదు. మంచాల మోడల్ స్కూల్ నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం 50, ద్వితీయ సంవత్సరం 52 మంది విద్యార్థులు, జి.కొత్తపల్లి కేజీబీవీ నుంచి ప్రథమ సంవత్సరం 38, ద్వితీయ సంవత్సరం 16 మంది విద్యార్థినులు చోడవరంలో వివిధ కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాయాల్సి ఉంది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేకపోవడంతో గ్రామీణ ప్రాంతం నుంచి వెళ్లే వీరంతా తెల్లవారుజాము నుంచే సన్నద్ధం కావాలి. పైగా చీడికాడ నుంచి ఆర్టీసీ బస్సు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

రీ సర్వే వేగవంతం చేయాలి

జేసీ జాహ్నవి



సర్వే వివరాలను పరిశీలిస్తున్న జేసీ జాహ్నవి

మాకవరపాలెం: భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని జేసీ జాహ్నవి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని పైడిపాల, లచ్చన్నపాలెంలో రీ సర్వేను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోగా రీ సర్వే పూర్తి చేయాలన్నారు. రెండు రెవెన్యూ గ్రామాల పరిధిలో మూడు వేల ఎకరాలు రీ సర్వే చేయాల్సిఉందన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీవో రమణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



కేక్ కట్ చేస్తున్న టైలర్ల సంఘం అధ్యక్షుడు శంకరరావు



కేక్ కట్ చేస్తున్న టైలర్లు

దేవరాపల్లి: టైలర్ల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆదుకోవాలని దేవరాపల్లి మహేశ్వరి టైలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉప్పు శంకరరావు కోరారు. శుక్రవారం దేవరాపల్లిలో మండల స్థాయిలో టైలర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శంకరరావు కేక్ కట్ చేశారు. లక్కీడ్రా తీసి మహిళా టైలర్లకు చీరలను బహుమతులుగా అందజేశారు. టైలర్స్ సంఘం తరుపున అభయాంజనేయ విగ్రహ నిర్మాణానికి రూ.10,116 మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుకు అందజేశారు. ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, సంఘం ఉపాధ్యక్షుడు వానపల్లి ప్రసాద్, కార్యదర్శి ఇంజరపు శ్రీనివాస్, బర్లి సంతోష్, శ్రీరాం దేవి, కొమ్మనాపల్లి దేవి పాల్గొన్నారు.

నాతవరం: ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా నాతవరంలో కోటమ్మ తల్లి వెల్ఫేర్ టైలర్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇదే వృత్తిలో కొనసాగుతున్నామని, ప్రభుత్వాలు తమకు సరైన గుర్తింపు ఇవ్వలేదన్నారు.

ముగిసిన పోతురాజులబాబు తిరునాళ్లు

కల్యాణపులోవ జాతర ఆదాయం రూ.16.03 లక్షలు



పోతురాజులబాబు ఆలయంలో హుండీ లెక్కింపు

రావికమతం: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కల్యాణపులోవలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న పోతురాజులబాబు తిరునాళ్లు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు సుమారు పది వేలమంది భక్తులు పోతురాజులబాబు, పెద్దింటమ్మను దర్శించుకున్నారు. గత మూడు రోజులుగా ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 2.20 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యారని దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయం వద్ద హుండీల ద్వారా వచ్చిన నగదును లెక్కించారు. హుండీ కానుకల ద్వారా రూ.8,04,351 ఆదాయం వచ్చిందని, ప్రసాదాల విక్రయం, కేశఖండన, ప్రత్యేక దర్శనం, సాధారణ టిక్కెట్ల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పల వేలం ద్వారా రూ.7,99,420 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. మొత్తం ఆదాయం రూ.16,03,771 లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆశా కిరణ్మయి తెలిపారు. గత ఏడాది జాతర ఆదాయం రూ.16,69,011 వచ్చిందన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతరావు, వీఆర్వో సింహాద్రి, పంచాయతీ కార్యదర్శి, పోలీసు సిబ్బంది, గిరిజన పెద్దల సమక్షంలో హుండీ లెక్కించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం



అవగాహన కల్పిస్తున్న ఏవో శైలజ

నాతవరం: కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ప్రకృతి వ్యవసాయం చేయడంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని ఏవో శైలజ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా చిన్న గ్రామ పంచాయతీలో ప్రకృతి వ్యవసాయం చేయడంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆ గ్రామంలో రైతులతో సాగు చేయించి, దాని వల్ల కలిగే ఉపయోగాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. తర్వాత ఆ గ్రామస్తులు, అధికారులు సంయుక్తంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, వెలుగు ఏపీఎం కనకరాజు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశ్వరస్వామికి వసంతోత్సవం

చోడవరం: స్వయంభూ గౌరీశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా నాగవల్లి వసంతోత్సవాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కోనేరు వద్ద స్వామివారి త్రిశూలస్నానం చేసి వసంత్సోవ ఊరేగింపును ఆలయ మాడవీధుల్లో నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు పెరగాలి

• అనకాపల్లి డీఎంహెచ్‌వో రవికుమార్



తురకలపూడి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

బుచ్చెయ్యపేట: పీహెచ్‌సీల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల సంఖ్యను పెంచే విధంగా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో పి. రవికుమార్ సూచించారు. తురకలపూడి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. కుటుంబ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు.వైద్యాధికారి సునీల్ మాధవ్, ఎంపీహెచ్ఈవో రాజశేఖర్, సిబ్బంది చంద్రమౌళి, రాజుబాబు, సయ్యపురెడ్డి లక్ష్మీనారాయణ, బాబ్జి, నరేష్ పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం పంపిణీ చేస్తారని ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ నెల నుంచి పింఛనదారుల సౌకర్యార్థం సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేస్తారని తెలిపారు.

300 ఎకరాల్లో రబీ వరి సాగు

కె.కోటపాడు: మండలంలో నీటి వసతి కలిగిన పొలాల్లో రబీ వరి సాగు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పూర్తి వర్షాధారితంగానే సాగు చేపడతారు. రబీలో ఎండల కారణంగా పంటలను కాపాడుకునేందుకు పొలాల్లో వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటితోపాటు బావుల ఆధారంగా రబీలో 300 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. చౌడువాడ, మల్లంపాలెం, రొంగలి నాయుడుపాలెం, గొండుపాలెం, పైడంపేట, పాడుగుపాలెం తదితర గ్రామాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు.

మినప తీత పనుల్లో రైతులు

మాడుగుల రూరల్: అపరాలు సాగులో భాగంగా మినప చేను తీసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ వరి కోతలు కోసిన వెంటనే మినుములు జల్లారు. అకాల వర్షాలు వల్ల వేసిన మినప విత్తనాలు నీటిలో కొట్టుకుపోయాయి. తర్వాత మరలా రైతులు చల్లుకోవాల్సి వచ్చింది. మార్కెట్‌లో కుంచం మినుములు రూ. 300 వరకు విక్రయిస్తున్నారు. దీంతో వరి పంట తీసిన వెంటనే అపరాలు సాగులో భాగంగా మినుములు చల్లుకున్నారు. వీటితోపాటు, పిల్లి పెసర, పెసర చల్లారు. ఇంకా అపరాలు పండలేదు.